# ప్రశ్నిస్తే అక్రమ కేసులు రెడ్ బుక్ రాజ్యాంగం ఇదేనా..?

- వైసిపి తిరుపతి జిల్లా ఎంపీ మద్దెల గురుమూర్తి ఫైర్



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** నెల్లూరు, తిరుపతి జిల్లాలో జరుగు తున్న అక్రమ మైనింగ్ పై, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పై నమోదైన కేసుల గురించి కీలక విషయాలు మాట్లాడారు. సోమవారం నెల్లూరు జిల్లా వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో పాల్గొన్న తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందనేదానికి నిదర్శనం జిల్లాలో ప్రజల సమస్యలపై మాట్లాడే కాకాని గోవర్ధన్ రెడ్డి పై అక్రమ కేసులు బనాయించడమే అని,న్యాయ వ్యవస్థ పై నమ్మకం ఉందని కాకాని పై పెట్టిన కేసులు నిలవవని,కూటమి నేతలు నెల్లూరు జిల్లా,తిరుపతి జిల్లాల్లో ఎక్కడ చూసినా అక్రమ మైనింగ్ చేస్తూ వైసిపి వారు చేస్తున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, ఈ అక్రమ మైనింగ్ ను పరిశీలించేందుకు వెళ్తామన్న తమ పార్టీ ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం అన్యాయమని, అసలైన మైన్ యజమానులు అన్ని అనుమతులు వున్నా కూటమి నేతలు మైనింగ్ తామే చేయాలని సరుకు తమకే ఇవ్వాలని బెదిరిస్తున్నారని దీనివల్ల మైనింగ్ పరిశ్రమ జరగక పోవడంతో మైనింగ్ పరిశ్రమ మీద ఆధారపడిన వేలాది మంది రోడ్డున పడ్డారని, మైనింగ్ నిర్వహణ కష్టం కావడంతో మైనింగ్ పరిశ్రమ మూతపడే పరిస్థితికి వచ్చిందని దీంతో ఇతర దేశాలకు ఎగుమతుల ద్వారా భారతదేశానికి వచ్చే విదేశీ నగదు ఆగిపోవడంతో పాటు రాష్ట్రాలకు రావలసిన ఆదాయం కూడా తగ్గిపోయిందని గతంతో పోల్చుకుంటే మైనింగ్ పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి పన్నులు ద్వారా వచ్చే ఆదాయం పూర్తిగా ఆగిపోయిందని ఎంపీ మద్దెల గురుమూర్తి కూటమి ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేసిన ఎమ్మెల్యే




**కావలి, ఏప్రిల్14 ప్రభాతవార్త** కావలి ముసునూరులోని టిడిపి కార్యాలయంలో సోమవారం సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్దిదారులకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అందచేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిరోజు సిఎం సహాయనిధి చెక్కులను పంపిణి చేయడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిప్రదాత చంద్రబాబు సహకారంతో అభివృద్ధి, సంక్షేమం ఎజెండాగా ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. 26 మంది లబ్దిదారులకు 30,49,714 లక్షలరూపాయల చెక్కులను పంపిణి చేయడం జరిగిందన్నారు. సిఎం చంద్రబాబు సహకారంతో సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణిలో రాష్ట్రంలో కావలి 2వస్థానం, జిల్లాలో6 నెంబర్‌వన్ స్థానంలో ఉన్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధికోసం చంద్రబాబు రోజుకు 18 గంటలు కష్టపడి పనిచేస్తున్నారన్నారు. నమోదు చేసుకున్న నెలరోజులలోనే సిఎం సహాయనిధి లబ్దిదారులకు అందిస్తున్న ఘనత టిడిపి ప్రభుత్వానిదేనన్నారు. ఆరోగ్యశ్రీ కింద అందుబాటులోకిరాని వైద్యఖర్చులు సిఎం సహాయనిధి ద్వారా అందచేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అద్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరక్టర్ తటవర్తి వాసు, టిడిపి నేతలు శానం హరి, కండ్లగుంట మధుబాబునాయుడు, తిరివీధి ప్రసాద్, కె.హరినారపరెడ్డి, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కు మేయర్ ఘన నివాళి





**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్ 14 ప్రభాతవార్త:** డా.బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి జయవర్ధన్ సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా స్థానిక వి.ఆర్.సి. కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి మేయర్ పూలమాలలు వేసి ఘన నివాళులను అర్పించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కళాకృతికి పూలమాలలు వేసి మేయర్, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బాల్య దశ నుంచి అసమానతలను ఎదుర్కొంటూ, కష్టపడి ఉన్నత విద్యావంతునిగా ఎదిగిన అంబేద్కర్ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, సంఘసంస్కర్తగా భారత దేశానికీ అందించిన సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు. అంటరానితనం నిర్మూలనకు అంబేద్కర్ చేసిన కృషి వల్లే నేటి సమాజంలో సామాజిక సమానత్వం సాధించగలిగామని తెలిపారు. బడుగు బలహీన వర్గాలు, మహిళలు, శ్రామికుల హక్కులు, వారి ఆర్థిక స్వతంత్రం కోసం అవిశ్రాంత పోరాటం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని ప్రశంశించారు.అంబేద్కర్ మహాశయుని జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆదర్శవంతమైన దేశ నిర్మాణానికి యువత తోడ్పడాలని మేయర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాస్ యాదవ్, అదనపు కమిషనర్ వై. ఓ. నందన్, మేనేజర్ ఇనాయతుల్లా, నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డ్స్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా
## భారీ నిరసన ర్యాలీ, అట్టుడికిన నెల్లూరు

- నల్ల దుస్తులు, నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేసిన జేఏసీ నాయకులు
- ర్యాలీలో పాల్గొన్న మైనార్టీ నాయకులు, ముస్లిం సోదరులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు.
- జిల్లా నలుమూలల నుండి దాదాపు పదివేల మంది పాల్గొన్న ముస్లిం సోదరులు




**నెల్లూరు సిటీ, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం సవరించిన వక్ఫ్ బోర్డ్ బిల్లుకు నిరసనగా సోమవారం నెల్లూరు నగరంలో ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో జరిగిన వక్ఫ్ బోర్డ్ చట్టానికి వ్యతిరేక నిరసన ర్యాలీలో జిల్లా వ్యాప్తంగా అన్ని జమాత్‌లు, రాజకీయ పార్టీలకు అతీతంగా పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేశారు. తొలుత నగరంలోని కోటమిట్ట యుసిఫియా మసీదు నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ వి.ఆర్.సి మీదుగా గాంధీ బొమ్మ వరకు సాగింది. ఈ ర్యాలీలో సుమారు పదివేల మంది ముస్లిం సోదరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం గాంధీ బొమ్మ వద్ద జరిగిన సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని, అలాగే ముస్లిం కమిటీ లతో చర్చించి ఒక ప్రణాళికతో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ముస్లిం సంఘాలు ప్రకటించాయి. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## కలెక్టరేట్‌లో అంబేద్కర్‌కు ఘన నివాళి



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** సోమవారం కలెక్టర్ కార్యాలయంలో శంకరన్ హాల్లో భారత రత్న అవార్డుగ్రహీత,సంఘ సంస్కర్త, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు,డిఆర్ఓ ఉదయ భాస్కరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. డిఆర్ఓ ఉదయభాస్కర్ తో పాటు ఏవో విజయ్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి..

- సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయంలో భారతరత్న అంబేద్కర్ జయంతి వేడుకలు.. - జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్






**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాలు చేరుకుని సమాజానికి మంచి చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం నెల్లూరు నగరంలోని మద్రాస్ బస్టాండ్ సమీపంలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయంలో భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, పలు సంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, జ్యోతి ప్రజ్వలనతో జయంతి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులనుద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ కృషివలన దేశంలో సమూల మార్పులు వచ్చాయని కలెక్టర్ అన్నారు. విద్యార్థులందరూ కూడా అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని, పేద వర్గాల అభ్యున్నతికి ఆయన అందించిన రాజ్యాంగం ద్వారా ప్రసాదించిన హక్కులను సద్వినియోగం చేసుకుంటూ బాగా చదువుకోవాలని, చదువు ద్వారా సమాజ హితం కోసం తమ వంతు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. జిల్లాలోని 62 సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో 9.32 కోట్లతో మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్, దోమతెరలు ఏర్పాటు మొదలైన కనీస వసతుల కల్పనకు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. రెండు నెలల్లోనే ఈ పనులన్నీ పూర్తవుతాయని కలెక్టర్ చెప్పారు. అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వానికి 5.50 కోట్లతో రివైజ్డ్ ఎస్టిమేషన్ పంపించామని, జిల్లాకు చెందిన మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణ కూడా ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సోషల్ వెల్ఫేర్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామితో కూడా మాట్లాడినట్లు చెప్పారు. ఈ సంవత్సరంలోనే ఈ భవనాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే గతంలో సిజేఎఫ్ఎస్ భూములను రద్దుచేసినప్పుడు 70 శాతం లబ్ధిదారులకు మాత్రమే పట్టాలు అందించామని, వివిధ రకాల కారణాలతో సుమారు 30 శాతం మందికి పట్టాలు ఇవ్వలేదన్నారు. అసైన్మెంట్ రివ్యూ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం నుంచి కమిటీల ఏర్పాటుకు ఆమోదం రాంగానే మిగిలిన వారికి కూడా నూతనంగా డీకేటి పట్టాలిస్తామని కలెక్టర్ వెల్లడించారు. అలాగే ఈ హాస్టల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారు. విద్యార్థులందరూ కూడా అంబేద్కర్ స్ఫూర్తితో బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వలనే దేశంలో అణగారిన వర్గాలు ఉన్నత స్థాయికి చేరాయని చెప్పారు. సమాజంలో అసమానతలు, అంటరానితనం రూపుమాపేందుకు ఆయన తన జీవితాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు. అమాయకులైన, నిరక్షరాస్యులైన గిరిజనుల భూములను చాలామంది తమ స్వాధీనం చేసుకున్నారని సోమిరెడ్డి అన్నారు. 2016 వావిలేటిపాడులో సుమారు నాలుగు ఎకరాల భూమిని బడా నేతలు ఆక్రమించే ప్రయత్నం చేశారని, ఆ సమయంలో గిరిజనులకు అండగా నిలబడి కలెక్టరేట్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి సర్వే చేయించి ఆ భూములను గిరిజనులకు అప్పగించినట్లు చెప్పారు. నేడు ఆ భూములు కోట్లాది రూపాయలు విలువ చేస్తున్నాయని, అక్కడ డెయిరీ ఫాం ఏర్పాటు చేసుకుని గిరిజన కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయని సోమిరెడ్డి గుర్తు చేశారు. ఈ విధంగా జిల్లాలో చట్టాలపై అవగాహన లేక చాలామంది గిరిజనులు మోసపోతున్నారని, వారికి అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సోమిరెడ్డి చెప్పారు. తన నియోజకవర్గంలో చాలామందికి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేవని, దీంతో వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందలేకపోతున్నారని, అర్హత ఉండి కూడా పింఛన్లు తీసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ కార్డు లేని ఎస్సీ ఎస్టీల కోసం ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేసి మండలాల వారీగా ఆధార్ కార్డు ఇప్పిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే తోటపల్లి గూడూరులో ఆధార్ కార్డులు జారీ ప్రక్రియ పూర్తయిందని, ముత్తుకూరులో కొనసాగుతున్నట్లు చెప్పారు. అన్ని మండలాల్లో కూడా ప్రత్యేకంగా గిరిజనులకు ఆధార్ కార్డు ఇప్పించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. అలాగే సర్వేపల్లి నియోజకవర్గం లోని హాస్టళ్లలో కనీస వసతులు కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు సోమిరెడ్డి చెప్పారు. అనంతరం రిటైర్డ్ ప్రొఫెసర్ కుసుమ కుమారి, రిటైర్డ్ ఏఎస్ డబ్ల్యు ఓ ఖాసీం క్లాత్ బ్యాగులు, పెన్నులను విద్యార్థులకు అందించారు. అంబేద్కర్ జీవిత చరిత్ర పై భారత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతులైన విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ లను పంపిణీ చేశారు. తొలుత పలు సంఘాల నాయకులు దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను, ఆయన భరించిన అవమానాలను, సాధించిన విజయాలను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, ఎస్ డబ్ల్యూ హజరతయ్య, పలువురు ప్రజా సంఘాల నాయకులు పలు సంఘాల నాయకులు ఎలీషా కుమార్, సోమశేఖర్, రాజశిఖామని, బాల చెన్నయ్య, వెంకయ్య, కుడుముల సుబ్బారావు, దళిత బాబు, మంద పెంచలయ్య, శ్రీనివాస మాదిగ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు క్షేమం.. ప్రశాంతమ్మ ఆశయం

- రైతుల అభివృద్ధిలో ప్రశాంతమ్మది ప్రత్యేక శైలి
- జిల్లాలో ధాన్యం కొనుగోలులో కోవూరు నియోజకవర్గం సరికొత్త రికార్డు
- ఇటీవలవరకు జిల్లాలో 83 వేల టన్నులు సేకరించగా..
- కోవూరు నుంచే 38 వేల టన్నుల కొనుగోలు
- దాదాపు 46 కొనుగోలు నియోజకవర్గం నుంచే
- ముందుచూపుతో పంట కాలువల్లో పూడిక తీత..
- రైతులకు తొలగిన వరద బెడద
- ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారం
- ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్న అన్నదాతలు



**కోవూరు ఏప్రిల్ 14 ప్రభాతవార్త** నీరు అందుతుందో లేదో తెలియదు.. సకాలంలో విత్తనాలు అందవు.. పంట చేతికివచ్చినా ఎక్కడ ఎవరికి అమ్మాలో అర్థం కాదు.. అమ్మినా దళారుల చేతిలో చిక్కి నష్టాలు చవిచూడటం తప్పని పరిస్థితి. ఇది గత 5 ఏళ్లలో కోవూరు నియోజకవర్గంలో అన్నదాతల దయనీయ స్థితి.నిత్యం సమస్యల వలయంలోనే పంటను పండిస్తూ నష్టాలతో సహవాసం చేసేవారు.

❖ **కానీ నేడు పరిస్థితి మారింది.** కోవూరు నియోజకవర్గానికి ప్రశాంతమ్మ ఎమ్మెల్యే అయ్యాక అన్నదాతల జీవితాల్లో మార్పు కనిపిస్తోంది. నవ్యమైన ఆలోచనలు,స్పష్టమైనప్రణాళికలతో రైతులకుదన్నుగా నిలుస్తూ.. రైతుల ముఖాల్లో సంతోషం నింపుతోంది. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ధాన్యం అమ్మకాల్లో దాదాపు 46శాతం ఒక్క కోవూరు నియోజకవర్గం నుంచే జరిగిందంటే అందులో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చూపిన చొరవ, సమస్యలను పరిష్కరించడంలో ఆమె తెగువ మరెవరికీ సాధ్యం కాదు. కోవూరు డెల్టా ప్రాంతంలో వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారు.అధికం2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతుల సంక్షేమం కోసం పాటుపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.నాడు రైతులు తన దృష్టికితెచ్చిన ప్రతి సమ స్యకు పరిష్కారం చూపుతామని చెప్పారు. ఇచ్చిన హామీల మేరకు ఎమ్మెల్యే అయిన వెంటనే కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా అనేక పనులు చేపట్టి రైతుల అవస్థలు తొలగించారు.

❖ **ధాన్యం కొనుగోలులో రికార్డు** ఇటీవల జిల్లా వ్యాప్తంగా ధాన్యంకొనుగోలు కేంద్రాల ద్వారా ముమ్మరంగా ప్రారంభమైన ధాన్యం సేకరణ కోవూరు నియోజకవర్గంలో రికార్డులుసృష్టించింది. ఇటీవల వరకు జిల్లా వ్యాప్తంగా 83 వేల టన్నుల ధాన్యం సేకరించగా..ఒక్క కోవూరు నియోజకవర్గంలోనే దాదాపు 38 వేల టన్నుల ధాన్యం సేకరించారు అధికారులు అంటే దాదాపు 46శాతం ధాన్యం అతి తక్కువ కాలంలో సేకరించారు.

ఇక మండలాల వారీగా చూస్తే అత్యధికంగా విడవలూరు మండలంలో రైతుల నుంచి 11244 టన్నుల ధాన్యంసేకరించగా..కోవూరుమండలంలో 10 800 టన్నులు, కొడవలూరు మండలంలో 8500 టన్నులు, బుచ్చిమండలంలో 4500 టన్నులు, ఇందుకూరుపేట మండలంలో 2500టన్నుల ధాన్యంసేకరించారు.అతితక్కువ కాలంలో ఇంతపెద్ద మొత్తంలో ధాన్యంసేకరించిన దాఖలాలు లేవని, ఇందంతా ఎమ్మెల్యే ప్రశాంతమ్మచొరవతోనే సాధ్య మవుతోందని అన్నదాతలు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

❖ **పక్కా ప్రణాళికతో** ఎమ్మెల్యే ప్రశాంతమ్మ గెలిచిన వెంటనే పంట కాలువల్లో పూడిక తీయించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే FDR, OM, Disaster management relief వంటి వాటి పరిధుల్లోలేని పనులను విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సొంత నిధులు వెచ్చించి మరీ ప్రత్యేక యంత్రాలు ఏర్పాటు చేయించి చేప ట్టారు. అన్ని మండలా ల్లో సాగునీటి కాలువలను బాగు చేయించి నీరు సాఫీగా చివరి ఎకరా వరకు చేరేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగారు. 2023లో పంట కాలువలు సరిగా లేకపోవడం వల్ల పొలాల్లోకి నీరు చేసి పంట నష్టం జరిగిన దాఖలాలు ఉండగా.. 2025లో ఒక్క ఎకరా కూడా నష్ట పోకపోవడం ప్రశాంతమ్మ ముందు చూపుకు నిదర్శనం అని రైతులు కొనియాడుతున్నారు.

❖ **పరిష్కారమే ప్రశాంతమ్మ లక్ష్యం** రైతుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రశాంతమ్మ.. నిత్యం అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలకు పరిష్కారం చూపారు. జిల్లాలో పంట చేతికి రాక ముందే ముందు జాగ్రత్త చర్యగా జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తిక్ గారిని కలిసిన ప్రశాంతమ్మ కోవూరు రైతులకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అలాగే జిల్లా పర్యటనకు వచ్చిన సివిల్ సప్లై మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి పలు అంశాలను తీసుకువెళ్లి కొనుగోలు వేగవంతం చేయాలని నాడు కోరారు. అలాగే అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో విజయవాడలో జిల్లా మంత్రులతో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్‌తో రెండుసార్లు భేటీ అయి పరిస్థితులను వివరించారు. అలాగే కలెక్టర్ ఓ. ఆనంద్ రైస్ మిల్లర్లతో ప్రత్యేకంగా భేటీ అయి ధాన్యం కొనుగోలు సమస్యలను పరి ష్కరించారు. ఇలా అన్నింటా నిరంతరం పర్యవేక్షణ, పక్కా ప్రణాళికతో ముందుకు సాగిన ప్రశాంతమ్మ.. చివరకు రైతుల జీవితాల్లో ఎప్పుడూలేని సంతో షాన్ని నింపారు. ధాన్యం కొనుగోలులో నియో జకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపారు.

❖ **24 గంటల్లోనే చెల్లింపులు..** రైతుల వద్ద నుంచి సేకరించిన ధాన్యానికి కూటమి ప్రభుత్వం 24 గంటల్లోనే చెల్లింపులు చేస్తోంది. ఇప్పటికే ధాన్యం అమ్మిన వారికి చెల్లింపులు చేపట్టారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన రైతులు ప్రభుత్వం నుంచి చెల్లింపులకు నెలల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. కూటమి ప్రభుత్వం తొలిప్రాధాన్యత అయిన వ్యవసాయంలో రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తున్నారు. అన్నదాత సంతోషంగా ఉండేలా నిత్యం పనిచే స్తూనే.. ధాన్యం డబ్బులను వెంటనేవారి ఖాతాలో జమ చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేస్తున్నారు. ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని, అన్నదాతలకు అండగా నిలుస్తుం దన్నారు





## అంబేద్కర్ అంటే ఆత్మగౌరవానికి ప్రతీక



**బుచ్చి ఏప్రిల్ 14 ప్రభాతవార్త :** భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అంటే ఆత్మ గౌరవానికి ప్రతీక అని దళితనాయకులు సూదల వెంకటరమణయ్య కొనియాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134 వ జయంతిని పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని అంబేద్కర్ భవన్‌లో సూదల వెంకటరమణయ్య అధ్యక్షతన జరిగిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. ముఖ్య అతిధులుగా పాల్గొన్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మాట్లాడుతు నేడు మహిళలకు ఓటు హక్కు రావడానికి కారణం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కృషి అని ఆమె కొనియాడారు. నేను చైర్‌పర్సన్‌గా ఉండడానికి కూడా కారణం అని పేర్కొన్నారు. కర్నూలు చెందిన ఈదూర్ పద్మాకర్, మాట్లాడుతు డాక్టర్ బిఆర్ అంబేదర్ ఆశయసాధనలో నడిచి తాను మంచి స్థాయికి ఎదిగానని అన్నారు. డాక్టర్ బిఆర్ ఆశయాలు చదవడంతో పాటు ఆయన ఆశయసాధనకు కృషి చేస్తు ఆయన అడుగు జాడలలో నడాలని అన్నారు. అంబేద్కర్ భవనం అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా సహాయ సహకారాలు అందిస్తానని హామి ఇచ్చారు. అనంతరం తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ శ్రీహరి మాట్లాడుతు నేటి యువతం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచనలను తప్పకుండా చదవాలని, ఉన్నతి స్థాయికి ఎదగాలని సూచించారు. ఈకార్యక్రమంలో వాణిజ్య పన్నులశాఖ అధికారి స్వర్ణా కపాకర్, బుచ్చి హాస్పటల్ డైరక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి, కమీషనర్ బాలకృష్ణా, కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ, టిడిపినాయకులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, బత్తల హరికృష్ణా, కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, బి.రఘునాదరావు . ఎం పుల్లయ్య, గట్టుపల్లి రవికుమార్, కలితోటి అనీల్, సిపిఎం నాయకులు వెంకమరాజు, ఇప్పగుంట సుధాకర్‌రెడ్డి ,కావలి వెంకటేశ్వర్లు, ఎం.వజ్రమ్మ, ఆర్‌కె రవి ,మాజీ ఎంపిటిసి సభ్యులు పూర్ణిమరాధ, షేక్, ఫర్వీన్, ఉసురుపాటి ప్రసాద్, బిజెపినాయకులు వినయ్‌నారాయణ, జ్యోతి ఎర్రయ్య,

## ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్



**బుచ్చి ఏప్రిల్ 14 ప్రభాతవార్త** భారత రాజ్యాంగ నిర్మాత, భారతదేశ ఔనత్యాన్ని ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తంగా చేసిన ప్రపంచ మేధవి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని బిజెపి రూరల్ అధ్యక్షులు సిద్దన మనోహర్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని ఇస్కపాళెం, పల్లాప్రోలు, చెల్లాయపాళెం, మినగల్లు పంచాయితీలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యనరకమంలో బిజెపి జిల్లా అధికారప్రతినిధి గంజం పెంచలప్రసాద్, మైనార్టీమోర్చ జిల్లా అధ్యక్షులు షేక్.ఖాదర్‌భాషా, జిల్లా ఉపాధ్యాక్షులు షేక్, ఖాసి, ఓబిసి జిల్లా కార్యదర్శి మహిమలూరు సతీష్ బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు వన్నెపంట బాలరాఘవరెడ్డి, కోప్పోలు మస్తానయ్య, మండల ప్రధానకార్యదర్శి పెజ్జాయి క్రిష్ణారెడ్డి, ఉపాధ్యాక్షులు మోడెం నిరంజన్‌రెడ్డి, దళితమోర్చ మండల అధ్యక్షులు కట్టా ఏడుకొండలు, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు నెల్లూరు సుబ్రమణ్యం, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## రక్తదాతలను అభినందించిన ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్14 ప్రభాతవార్త** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో దాదాపు వందమంది రక్తదానం చేశారు. సోమవారం బుడమగుంట అంబేద్కర్ కాలనీలో జరిగిన రక్తదాన శిబిరంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణా రెడ్డి రక్తదాతలను పేరుపేరునా పలకరిస్తూ అభినందించారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో అంబేద్కర్ చిత్రపటానికి రెడ్‌క్రాస్ బాధ్యులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ పాములూరు శ్రీధర్‌లు అంబేద్కర్ గొప్పతనాన్ని కొనియాడారు. కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు ఎస్‌కె అబ్దుల్‌నయీం ఆధ్వర్యంలో పలువురు రక్తదానం చేశారు. ఈ శిబిరంలో నయీం 30వసారి రక్తదానం చేశారు. బోగోలు మండలం రామస్వామి పాలెంలో అంబేద్కర్ యువసేన సభ్యులు, ముత్యాలపాడు గ్రామంలో అంబేద్కర్ యువత రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ దాకారపు రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూధన్‌రావు, జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, టీమ్ సేవియర్స్ అధ్యక్షులు నల్లిపోగు ప్రణీత్, రొటేరియన్ నల్లూరు రవికుమార్, కావలి ఏరియా ఆసుపత్రి అడ్వైజరి కమీటి సభ్యుడు పొబ్బ సాయివిఠల్, పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డా. బిఆర్ అంబేద్కర్



**ముత్తుకూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డా. బిఆర్ అంబేద్కర్ అని కృష్ణపట్నం టిడిపి నాయకులు రాగాల శివకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని కృష్ణాపట్నం పంచాయితీలోని హరిజనవాడలోని డా. బిఆర్. అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు పురస్కరించుకుని టిడిపి నాయకులు రాగాల శివకృష్ణ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాట్లాడుతూ దేశానికి అపురూపమైన రాజ్యాంగాన్ని అందించిన ఘనత అంబేద్కర్ కే దక్కుతుందన్నారు. డాక్టరు బీ.ఆర్. అంబేద్కర్ ను భారత రాజ్యాంగ పితామహుడని భారత రాజ్యాంగ నిర్మాణంలో ప్రముఖపాత్ర నిర్వహించారని, ఆయన అందించిన రాజ్యాంగ అంశాలతో అణగారిన వర్గాల అభ్యుదయ ప్రయత్నాలు భాగమే భారతదేశాన్ని 2047కి ప్రపంచంలో అత్యంత శక్తవంతమైన దేశంగా అవతరించే దిశగా ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. భారతీయ రాజకీయవేత్త, సంఘ సంస్కర్త అయిన బి. ఆర్. అంబేద్కర్ జ్ఞాపకార్ధంగా, ఆయన జన్మదినం అయిన ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి జరుపుకుంటున్నామని అన్నారు. గోని నాగరాజు, వెంకటరమణయ్య, వావిళ్ళ వెంకటరమణయ్య, మహేష్, చైతన్య, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శం అంబేద్కర్ శేషమ్మ



**విడవలూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** మండల కేంద్రం హరిజనవాడ కాలనీ ఆవరణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు దళిత నాయకురాలు పల్లం శేషమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడుతూ సమాజంలో బడుగు బలహీన వర్గాల ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారు అంటే అంబేద్కర్ పుణ్యమని ఆయన బాటలో ప్రతి ఒకరు నడవాలని సూచించారు. అంతకుముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ప్రజలకు మంచిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నా వూరు మరియమ్మ, జెడ్డా స్వామి దాస్, శిల్ప, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 జయంతి వేడుకలు



**కొడవలూరు, విడవలూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు తహసిల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. చరిత్రపై చెరగని ముద్ర వేసుకున్న మహనీయుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి అలుపెరుగక అనుక్షణ పోరాటం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సారంగపాణి, ఆర్ ఐ సునీల్ రెడ్డి, వీఆర్వోలు సుబ్బయ్య, దేవదాసు, యు.సురేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు ఘన నివాళి



నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త : డా. బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఆదనపు ఎస్పీ సిహెచ్. సౌజన్య ఆయనకు ఘన నివాళులు అర్పిం చారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసిన అనం తరం అంబేద్కర్ జీవితం గురించి మాట్లాడుతూ ప్రతి పౌరుడు స్వేచ్ఛా జీవనానికి రాజ్యాంగం కారణమని, రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్‌కు అందరూ ఎప్పటికీ కృతజ్ఞతతో ఉండాలన్నారు. ఆయన చూపిన నిబద్ధత, స్ఫూర్తి, త్యాగనిరతి, పోరాటపటిమ నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. యస్.బి. డిఎస్పి శ్రీనివాసరావు , ఏఆర్ డిఎస్పి చంద్రమోహన్, డిసిఆర్‌బి సీఐ రామారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134 జయంతి



**బుచ్చి ఏప్రిల్ 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలోని కట్టుబడిపాళెంలో డాక్టర్ అంబేద్కర్ 134 వ జయంతి వేడుకలు ఘంగా నిర్వహించారు. ఈకార్యక్రమం డాక్టర్ చీదరాల చెన్నయ్య ఆద్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అంబేద్కర్ పుస్తక ప్రియుడని అన్నారు. విద్యార్ధులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన కొన్ని వేల పుస్తకాలను చదివేరని తెలిపారు. 32 డిగ్రీలు సాధించిన ఏకైక భారతీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. అనంతరం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో తూపిలి వెంకటరత్నం, సాదేపల్లి రవికుమార్, ఈదూరి నరేంద్రబాబు, సూదల సురేంద్రబాబు, నక్కా మహీదర్, అల్లాడి వంశీ, హరీష్, కృష్ణ ప్రసాద్, చిన్న. అనీల్, ఆమారి వెంకటరమణయ్య, పొన్నపుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గోని కేకును కట్ చేసి గ్రామస్తులకు పంచిపెట్టారు.

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు నివాళులు అర్పించిన నూర్‌బాషా దూదేకుల సంఘం



**కావలిరూరల్, ఏప్రిల్14 ప్రభాతవార్త** కావలి నూర్‌బాషా దూదేకుల సంఘం ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. కావలి పట్టణంలోని ఏరియా వైద్యశాల ఎదురుగా ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి సోమవారం కావలి నూర్‌బాషా దూదేకుల సంఘం అధ్యక్షులు షేక్.ఖలీల్, ఆర్గనైజింగ్ సెక్రటరి షేక్.చాన్‌బాషా, గౌరవ అధ్యక్షులు షేక్.గౌస్‌బాషా, మహిళా సమాఖ్య అధ్యక్ష ప్రధానకార్యదర్శులు షేక్.మున్ని, షేక్.నన్నెమ్మ, మీడియా ప్రతినిధి షేక్.షానవాజ్, షేక్.రఫి, షేక్.మస్తాన్‌లు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత, న్యాయవాది ఆర్థికవేత్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని తెలియచేశారు. అంటరానితనం నిర్మూలనకు ఎంతగానో కృషిచేశారని తెలిపారు. స్వాతంత్ర్య భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖా మంత్రిగా, రాజ్యాంగ శిల్పిగా అందరూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈయన 1891 ఏప్రిల్14వ తేదీన అప్పటి సెంట్రల్ ప్రవీణ్‌సెస్‌లో సైనిక స్థావరమైన మౌ అనే గ్రామంలో ఇప్పటి మధ్యప్రదేశ్ రాంజీమాలోజీసాక్వాల్, భీమాభాయి దంపతులకు చివరిసంతానంగా జన్మించారని ఇతని అసలు పేరు భీమారావు రాంజీ అంబేద్కర్ అని తెలియచేశారు. నూర్‌బాషా దూదేకుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రేబాలలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి



**బుచ్చి ఏప్రిల్ 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల పంచాయితీలో ని సచివాలయంలో సర్పంచ్ లఘంతోటి బాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ 134 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతు అంబేద్కర్ పుస్తక ప్రియుడని అన్నారు. విద్యార్ధులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన కొన్ని వేల పుస్తకాలను చదివేరని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి జలీల్, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయసాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి



**బుచ్చి ఏప్రిల్ 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని మూడవ వార్డు కౌన్సిలర్ అందెప్రత్యూషా ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సూరా శ్రీనివాసులురెడ్డి, చేనేత రాష్ట్ర డైరక్టర్ సూరా శ్రీనివాసులు రెడ్డి, బిజెపి నేత కాసా శ్రీనివాసులు, జనసేన అతినేత తుమ్మల ప్రసాద్ పాల్గొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగ కేకును కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ అందే ప్రత్యూషా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకుప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పెనుబల్లి సర్పంచ్ ఓడా పెంచలయ్య, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, బిజెపినాయకులు కళ్యాణ్, టిడిపినాయకులు రమేష్‌రెడ్డి, చిరమణ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో అగివున్న బైక్‌ను ఢీకొన్న కారు

ప్రమాదంలో ఇద్దరు మృతి





**రాపూరు, ఏప్రిల్14ప్రభాతవార్త** ఎండకు ఆరబెట్టిన వడ్లు వాన వస్తే తడచిపోతాయని వెంటనే వాటిని బస్తాలలోకి ఎత్తి వస్తానని, తనను అక్కడదాకా బైక్‌లో వదలమని చెప్పి బైక్‌లో వెల్లిన వరసకు అత్తా, అళ్ళుల్లను మద్యం మత్తులో వస్తున్న కారు రూపంలో మృత్యువు కబలించింది. ఇందుకు సంబందించిన వివారాలు ఇలా వున్నాయి. మండల కేంద్రమైన రాపూరుకు చెందిన గంధం సరస్వతి సోమవారం తన భర్తతో కలసి రాపూరు..చిట్వేలి రూట్‌లో వున్న తిక్కన పార్కు వద్ద వున్న తోటలో వడ్లును ఆరబెట్టింది. మద్యాహ్నం బోజనానానికి ఇంటికి వచ్చిన ఆమె వాతవరణం మారి వర్షం వచ్చేలా వుండటంతో, వరసకు తనకు అల్లుడైన సురేష్ కార్పెంటర్ పని చేసుకుంటుండగా వర్షం వచ్చేలా వుందని వడ్లు తడచిపోతాయని, వాటిని గోతాలలోకి ఎత్తాలని తనను అక్కడ దించాలని సురేష్‌ను కోరింది. దీంతో సురేష్ తన మిత్రుని బైక్ తీసుకోని ఆమెను ఎక్కించుకోని పార్కు వద్ద వున్న తోట వద్ద దింపాడు. ఇంతలో నెల్లూరు నుండి రాజంపేట వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఆగివున్న వారి బైక్‌ను ఢీకోని కాస్తా దూరం లాక్కెల్లింది. ఈ ప్రమాదంలో గంధం సరస్వతి(45), గార్లపాటి సురేష్‌లు కిందపడియారు. సంఘటనా స్థలంలోనే సురేష్(30) మృతి చెందగా, సరస్వతి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అక్కడ మృతి చెందింది. కారులో వున్న ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి వున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట రాజేష్ తెలిపారు.

## అదాని కృష్ణపట్నం పోర్టులో జాతీయ అగ్నిమాపక సేవా వారోత్సవం



**ముత్తుకూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** అదానీ కృష్ణపట్నం పోర్ట్‌లో సోమవారం అగ్నిమాపక వారోత్సవ కార్యక్రమం ప్రారంభమైంది అగ్నిమాపక భద్రత చాలా ముఖ్యమైనదనీ ప్రతి ఉద్యోగి, కార్మికుడు, వ్యాపార సహచరులు మరియు ఇతర వాటాదారులు, ఉద్యోగులు, వారి కుటుంబాలతో పాటు సాధారణ ప్రజలలో కూడా భద్రతా అవగాహనను కలిగించాలని అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ తెలిపారు. 80వ జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవ వేడుకల్లో వివిధ విపత్తుల కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. ఎకెపిఎల్ సిఇఓ, ప్రమాదాలను తగ్గించడంలో సంసిద్ధత యొక్క ప్రాముఖ్యతను ఈ సందర్భంగా వివరించారు. సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించడానికి ఎకెపిఎల్ అగ్నిమాపక విభాగం అవిశ్రాంత సేవ, అంకితభావాన్ని ఆయన ప్రశంసించారు. అగ్నిమాపక శాఖకు చెందిన నైపుణ్యం కలిగిన సిబ్బంది నిర్వహించిన ప్రత్యక్ష అగ్ని ప్రదర్శన ఈ వేడుకలో ఒక ముఖ్యాంశం. ఈ సందర్భంగా భద్రత ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.



## పోలీసు స్టేషన్‌లో అంబేద్కర్ జయంతి వేడుక



**దగదర్తి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** మండల కేంద్రమైన దగదర్తిలోని పలు కార్యాలయాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో కావలి రూరల్ సర్కిల్ సీఐ బి.పాపారావు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయం తి కార్యక్రమాన్ని నిర్వహించా రు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికిపూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దగదర్తి ఎస్సై జంపాని కుమార్, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కుడితిపాలెంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**ఇందుకూరుపేట, ఏప్రిల్ 14, ప్రభాత వార్త** ఇందుకూరుపేట మండలంలోని కుడితిపాలెం గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచి యువత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు జరగడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉద్యోగస్తులు, అంబేద్కర్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కు నివాళులర్పించిన పశుసంవర్ధక శాఖ



**కోవూరు ఏప్రిల్ 14 ప్రభాతవార్త** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను సోమవారం శాంతినగర్ లో ఉన్న పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సోమవారం ఆ మహనీయుని చిత్రపటానికి పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ మోర్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ వాణి శంకర్ డాక్టర్ షబానా డాక్టర్ ప్రీతి సాల్మన్ కోవూరు విడవలూరు మండలానికి సంబంధించిన పశు సంవర్ధక శాఖ సహాయకులు ఉన్నారు

## ముస్లింల శాంతియుత ర్యాలీ




**కోవూరు ఏప్రిల్ 14 ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వక్స్ బోర్డ్ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం కోవూరు ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నేతలు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వక్స్ బోర్డ్ బిల్లును ప్రవేశ పెట్టడం సరి అయింది కాదన్నారు దీనిని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఉపసంహరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక బజార్ సెంటర్లో చేపట్టిన ఈ శాంతియుత ర్యాలీకోవూరు పురవీధుల్లో పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కోవూరు ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీకి చెందిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## అంబేద్కర్ కు వైసిపి నేతలు నివాళులు



**కోవూరు ఏప్రిల్14 ప్రభాతవార్త** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సోమవారం ఆ మహనీయుని 135వ జయంతి సందర్భంగా మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బడుగు బలహీన వర్గాలకు ఆ మహనీయుడు చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అనుప్ రెడ్డి మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహులు రెడ్డి జడ్పిటిసి సభ్యురాలు శ్రీలత పడుగుపాడు మాజీ సొసైటీ అధ్యక్షులు ఆర్ మల్లికార్జున రెడ్డి జిల్లా వైసీపీ యాక్టివ్ కార్యదర్శి సుబ్బారెడ్డి వైసీపీ సీనియర్ నాయకులు భీమతాటి శ్రీధర్ మల్లవరపు చిరంజీవి అంజన్ రావు పెద్ద సంఖ్యలో నేతలు కార్యకర్తలు ఉన్నారు

## కోనలో స్వర్ణ గరుడవాహనంపై నృసింహ స్వామి



**పెంచలకోన (రాపూరు), ఏప్రిల్14, ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో సోమవారం శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారికి స్వర్ణ గరుడ వాహన సేవ నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతీ నక్షత్రం సందర్భంగా ఉదయం స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, చందనాలం కారం నిర్వహించారు. ఉదయం 9,30కి స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని స్వర్ణ గరుడవాహనంపై వుంచి స్వర్ణ గరుడవాహన సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని స్వామి వారి చందనాలంకారం దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన బోజన, వసతి, దర్శనం ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, పులగల నరసింహ తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా, అలంకరణ కార్యక్రమాలను ఆలయ ప్రధానర్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వినోద్ స్వామి, వెంకట బాలజీ స్వామి సాయి స్వామి ,నాగరాజు స్వామి తదితరులు వేదమంత్రాలతో, శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## ప్రీ ఐఐటి ఒలింపియాడ్‌లో జెమ్స్ విద్యార్ధులు




**రాపూరు, ఏప్రిల్ 14 ప్రభా తవార్త** మండల కేంద్రమైన రాపూరులోని జెమ్స్ ఇం గ్లీషు మీడియం పాఠశాలకు చెందిన విద్యార్ధులు రాష్ట్ర స్థాయి ప్రీ ఐఐటి నందు ర్యాంకులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బులగాకుల మునీంద్రా రెడ్డి తెలిపారు. తమ పాఠశాల విద్యార్ధులు ఈ అభ్యాస్ ప్రీ ఐఐటి ఒలింపియాడ్ నందు రాష్ట్ర స్థాయిలో ప్రధమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులను 45 మంది విద్యార్ధులు సాధించి గుంటూరులో జరిగిన ఈ అభ్యాస్ 2025 అవార్డు ఫంక్షన్‌లో అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డిసిపి సరిత, ఇస్రో సినియర్ సైంటిస్ట్ వేణుగోపాల్, యంఎల్‌సి యం.వి రామచంద్రా రెడ్డి తదితరులు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెమ్స్ పాఠశాల ప్రీ ఐఐటి నందు రెండు సంవత్సరాలుగా సాధించిన ప్రగతికి సూచికగా యంగ్ ఎద్యుకేషనల్ ఇంటర్‌ప్యూనర్, బెస్ట్ ఒలింపియాడ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను పాఠశాల కరస్పాండెంట్ బులగాకుల మునీంద్రా రెడ్డి ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మునీంద్రా రెడ్డి మాట్లాడుతూ ఒక మారుమూల గ్రామమైన రాపూరు నుండి రాష్ట్ర స్థాయిలో ఇన్ని ర్యాంకులు సాధించిన తమ పాఠశాల విద్యార్ధులకు, వారికి సహకరించిన పిల్లల తల్లితండ్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, SHAIK FEROZ BASHA (Old Name) S/O Shaik Mahaboob Saheb, born on (10/08/1961) residing at 28-6-250, Rajiv Gandhi Colony, Stonehousepet, Nellore District (A.P) - 524002 have changed my name to SHAIK FYROZ (New Name) (Ro.No.1422)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసిన డీఎంహెచ్ఓ



**నెల్లూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త–వైద్యం** : నగరంలోని సంతపేట లోఉన్న జిల్లావైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌జయంతి వేడుకలను నిర్వహించారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వంగల సుజాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రప టానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకల్పనకు చేసిన విశిష్ట సేవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఏటీఓ డాక్టర్ ఖాదర్ వలీ, డీఐఓ ఉమామహేశ్వరి, డీపీఎంఓ డాక్టర్ రమేష్, డెమో కనకరత్నం, డీఎస్ఓ డాక్టర్ భాస్కర్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ దివ్య, ఏవో నిశాంత్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు.

## టీడీపీ కార్యాలయంలో ఘనంగా అంబేద్కర్ జయంతి



**నెల్లూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త–వైద్యం** : భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నగరం లోని మినీ బైపాస్ రోడ్డులో ఉన్న తెలుగు దేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో నగర అధ్యక్షుడు మామిడాల మధు ఆధ్వర్యంలో వరంగల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా అధ్యక్షుడు చేజర్ల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమ ణయ్య, గాలాజు శివాచారి, నన్నే సాహెబ్, నెల్లూరు పార్లమెంటు మహిళా పనబాక భూలక్ష్మీ, నగర అధ్యక్షురాలు కప్పిర రేవతి, పిట్టి సత్య నాగేశ్వరరావు, ఊరందూరు సురేంద్ర, శైలేంద్రబాబు, పొత్తూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ భవన్లో అంబేద్కర్ జయంతి



**నెల్లూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త–వైద్యం** : డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని విద్యుత్ భవన్లో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్ అంబేద్కర్ చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళుల ర్పిం చారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న మహారాష్ట్రలోని మాలో పట్టణంలో జన్మించారు. బాల్యంలోనే సామాజిక అసమానత, కుల వివక్ష వంటి అనేక దుస్థితులను ఎదుర్కొన్న ఆయన వాటిపై విజయం సాధించి ఒక గొప్ప సంఘ సంస్కర్తగా ఎదిగారని అన్నారు. అంబేద్కర్ కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. న్యాయశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, రాజకీయ శాస్త్రాలలో ఆయనకు ఉన్న ప్రత్యేక పరిజ్ఞానం దేశ నిర్మాణంలో కీలకంగా మారింది. భారత రాజ్యాంగాన్ని తయారు చేసే కమిటీకి అధ్యక్షులుగా పని చేసిన అంబేద్కర్, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలపై ఆధారపడిన రాజ్యాంగాన్ని రూపొందించారు. ఆయన అందించిన ఈ రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత సమగ్రమైన ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం కలిగిన పత్రికగా నిలిచిందన్నారు. అంబేద్కర్ దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎంపీ,ఎమ్మెల్సీ నివాళి



**నెల్లూరురూరల్, ఏప్రిల్ 14,ప్రభాతవార్త** : నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియో జకవర్గ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని అంబేద్కర్ చిత్రపటానికి తిరు పతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తితో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపి గురుమూర్తి మాట్లాడుతూ మాట్లాడుతూ డ్రాఫ్ట్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారతదేశానికి ఎంతో దృఢమైన రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. రాజ్యాంగ ఫలాలు ప్రజలందరికీ అందాలంటే సరైన రాజకీయ వ్యవస్థ పనిచేయాలన్నారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం రెడ్ బుక్ పరిపాలన అమలు చేస్తూ.. రాజ్యాంగాన్ని అపహస్యం చేస్తుందని దుయ్యబట్టారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలే టార్గెట్ గా టిడిపి నేతలు రెచ్చిపోతున్నారని వారి అరాచకం ఎంతో కాలం సాగదని హెచ్చరించారు. ఈరోజు చిత్తూరు జిల్లా గంగాధర్ నెల్లూరులో కూటమి ప్రభుత్వం కొంతమంది ప్రజలకు, ఉద్యోగులకు ఎలాంటి పని చేయకూడదని ఆదేశాలు ఇస్తూ విభజించి పాలించు సూత్రాన్ని అమలు చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపి ఎన్ జి జి ఓస్ అధ్వర్యంలో భారత రత్నకు ఘన నివాళులు



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** : నెల్లూరు జిల్లా ఏ పి ఎన్‌జి జి ఓస్ భవనం నందు భారత రత్నఅవార్డు గ్రహీత,సంఘ సంస్కర్త, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నెల్లూరు జిల్లా ఏ పి ఎన్ జి జి ఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడడంజరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంచలయ్య అసోసియేట్ అధ్యక్షులు ఆంజనేయవర్మ ఉపాధ్యక్షులు కరుణమ్మ సంయుక్త కార్యదర్శులు రాజేంద్ర ప్రసాద్ కృష్ణ కుమార్ నెల్లూరు నగర అధ్యక్షులు రామకృష్ణా రెడ్డి కార్యదర్శి మార్కండేయులు మహిళా చైర్పర్సన్ చిన్నమ్మ, కన్వీనర్ నవోదయ, స్వర్ణలత, సురేష్, శంషుద్దీన్, మధు, చెంచయ్య, కోటేశ్వర రెడ్డి, రాధ, మల్లిఖార్జున, మురళి, రమేష్ బాబు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి



కావలిరూరల్, ఏప్రిల్14 ప్రభాతవార్త కావలి రామ్మూర్తిపేటలోని కావలి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కార్యాల యంనందు కావలి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పొదలకూరి కళ్యాణ్ ఆధ్వర్యంలో సోమవారం రాజ్యాంగనిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది అనంతరం కావలి ఏరియా వైద్యశాల ఎదురుగా ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రనాయకులు ఎల్ సురేష్‌బాబు, రాష్ట్ర బిసిసెల్ ఉపాధ్యక్షులు కమలాపురి శ్రీనివాసులుగౌడ్‌లు మాట్లాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగనిర్మాతేకాదని, సంఘసంస్కర్త, ఆర్థికవేత్త, రాజకీయవేత్త అని తెలియచేశారు. ఆయన రచించిన రాజ్యాంగం అన్ని కులాలకు, మతాలకు, బడుగు, బలహీనవర్గాలకు ఒక దిక్సూచి అని ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ కావలి నియోజకవర్గ మైనారిటిసెల్ ఇన్‌చార్జి షేక్.రియాజ్, కావలి పట్టణ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి ఎ.మోహరావు, కావలి రూరల్ మండల అధ్యక్షులు ఉప్పాల తిరుపతిరావు, బోగోలు మండల అధ్యక్షులు కంచి వెంకటేశ్వర్లు, దగదర్తి మండల అధ్యక్షులు కాకాణి చంద్రయ్య, అల్లూరు మండల అధ్యక్షులు గుడ్ సంపత్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎల్.వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మా వాసు, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు పైడి రవీంద్రబాబు, కావలి పట్టణ ఎస్టి సెల్ అధ్యక్షులు డి.శ్రీకాంత్, కావలి టౌన్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు టి.బాలు, తదితరులు పాల్గొన్నారు.

## భారీ స్థాయిలో అన్నదానం



కోవూరు ఏప్రిల్ 14 ప్రభాతవార్త కోవూరు లోనిప్రధాని రహదారి స్థానిక మండ బ యలు సెంటర్లో వెలసి ఉన్న మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రాంతంలో సోమవారం ఆ మహనీయుని 135 వ జయంతి సందర్భంగా అంబేద్కర్ పూర్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీస్థాయిలో అన్నదాన కార్యక్ర మాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ట్రైన్ డిఎస్పి ఏ శివప్రియ కోవూరు సిఐ సుధాకర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహనీయుని జయంతి సందర్భంగా ఇటువంటి మంచి కార్యక్రమాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను వారు ప్రత్యేకంగా అభినందించారు.చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## బహుముఖ ప్రజ్ఞశాలి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ : ఎమ్మెల్యే



**వింజమూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** : భారత రాజ్యాంగ పితామహుడు, సామాజిక సంఘసంస్కర్త, న్యాయవేత్త ఆర్థిక తత్వవేత్త భారతదేశంలోని దళిత నిమ్న వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి అలుపెరగని పోరాటం చేసిన నేత స్త్రీ జనార్ధరకుడు బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఉదయగిరి శాసనసభ్యులు డాక్టర్ సురేష్ కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని వింజమూరులోని బంగ్లా సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్న పేద వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. సమాజంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపి సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ చేసిన కృషి ఎప్పటికి మరువలేనిదని గుర్తు చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం తమ కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, గత ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, ఎస్సీ కార్పొరేషన్, ఎస్టీ కార్పొరేషన్‌లను తిరిగి ప్రారంభించి ఆయా వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎస్సీ ,ఎస్టీల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని, వారి సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా తామంతా పని చేస్తూ వారికి అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఎంఅండ్ హెచ్ఓ కే.మాశిలామణి, మాజీ సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, ఏడీపీఎస్ నాయకులు గుజ్జు చెన్నయ్య, బండారు లక్ష్మణ్, అరుకొండ సురేష్, సీనియర్ దళిత నాయకులు వాగాల పెంచలయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు గంగపట్ల వెంగయ్య, భూదాల ప్రేమ్ దాస్, మూర ‌పెద్దన్న, భోజనపు ఆనంద్, గోసు మహేష్, సోక, రమేష్, కే.చంద్రశేఖర్, జ జగదీశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణకు వ్యతిరేకంగా తీర్మాణం చేయాలని గ్రామసభలో మెమోరాండం



**ఉలవపాడు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** : కరేడు గ్రామంలో ఎండో సెల్ కంపెనీ నిర్మాణం చేస్తున్న సోలార్ ప్లాంట్ నిర్మాణం కొరకు చేస్తున్న భూసేకరణకు వ్యతిరేకంగా గ్రామ పంచాయతీ తీర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ కరేడు గ్రామ ప్రజలు గ్రామ పంచాయతీ కార్యదర్శికి మెమోరాండం సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా 193 బీసీ కులాల ఐక్యవేదిక చైర్మన్ మిరియం శ్రీనివాసులు, ఐఎఫ్‌టీయు రాష్ట్ర నాయకులు ఆర్.మోహన్, దాచూరి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కరేడు గ్రామంలో ఎండో సెల్ కంపెనీ సోలార్ ప్లాంట్ నిర్మాణం కొరకు సుమారు 8 వేల ఎకరాలు భూమిని సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం మార్చి 25వ తేదీన జీవో నెంబరు 43 విడుదల చేసింది. గ్రామంలో 6500 ఎకరాల భూములు కలిగిన రైతులు నిర్వాసితులవుతారని ఆ పంట పొలాల్లో పని చేసే కూలీలు పనులు లేక పొట్ట చేత పట్టుకుని వలస వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడుతుందని పశువులు మూగజీవాలు తిరిగేందుకు కనీసం గజం స్థలం కూడా లేకుండా పోతుందని అందువలన ప్రజలకు జీవనోపాధి లేకుండా వారి జీవితాలను ధ్వంసం చేస్తున్న సోలార్ ప్లాంట్ నిర్మాణం జరగకుండా తీర్మాణం చేసి ప్రజల జీవితాలను కాపాడాలని పర్యావరణాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా రాజ్యాంగ నిర్మాత జన్మదిన వేడుకలు



**జలదంకి,ఏప్రేల్14,ప్రభాతవార్త**: భారత రాజ్యాంగ నిర్మాత భీమ్‌రావ్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను మండలంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు.అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో అంబేద్కర్ చిత్రపటాలను వుంచి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిచారు.ఎంపిడిఓ కార్యాల యంలో ఎంపిపి గోచిపాతల వెంకటరమణయ్య ఆద్వర్యంలో మండలపరిషత్ సిబ్బంది బిఆర్‌అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి పుష్పాంజలి ఘటించారు.అలాగే తహసిల్‌దార్ కార్యాలయంలో తహసిల్‌దార్ ప్రమీల ఆద్వర్యంలో సిబ్బంది రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పించారు.జలదంకి తెలుగుదేశంపార్టి కార్యల యంలో ఆపార్టి మండల అధ్యక్షుడు పులిగుంట మధుమోహన్‌రెడ్డి ఆద్వర్యంలో నాయకులు వంటేరు జయ చంద్రారెడ్డి,పూనూరు భాస్కర్‌రెడ్డి,పంచాయతి ఉపసర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డి,ఎస్‌సిసెల్ నేతలు వేణు,ఏగూరి రఘు,ఒంగోలు మాల్యాద్రి,ఏతలు వింతాసుబ్బారెడ్డి,తిరుపతయ్య,మారుబోయిన నారా యణ, మండల కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్ తదితర నేతలు అంబేద్కర్‌కు నివాళులర్పించారు.అలాగే బిజెపి మండల అధ్యక్షుడు ముడి కొషోర్‌రెడ్డి ఆద్వర్యంలో బికె అగ్రహారం కాలనీలో ఏర్పాటుచేసివున్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళుల ర్పించారు.జలదంకి ప్రాదమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీనివాసులు ఆద్వర్యంలో సిబ్బంది బిఆర్ అంబేద్కర్‌కు సివాళులర్పించారు.అదికారులు,నాయకులు మాట్లాడుతు ఉన్నతవిద్యావంతుడు,గొప్పమేదావి అయిన అంబేద్కర్ సమాజంలో పౌరులందరు స్వేశ్ఛ సమానత్వం కలిగివుండాలని ఆదిశగ ఆయన ఎంతో కృషిచేశాడని కొనియా డారు.ఆయన చేసిన సేవలుమరువరానివని,భారతజాతికి అంబేద్కర్ నిత్య స్ఫూర్తిప్రధాతని శ్లాఘిం చారు.ఆయన ఆశ యాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.మండలంలోని ప్రతి దళితవాడలో యువత రెట్టించిన ఉత్సా హంతో అంబేద్కర్ జయంతిని జరుపుకున్నారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రిజర్వేషన్ల పరిరక్షణ కోసం పోరాడుదాం



**ఉలవపాడు,ఏప్రిల్ 14,ప్రభాతవార్త** : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అహర్నిశలు శ్రమించి సాధించిన రిజర్వేషన్లు ప్రవేటీకరణ వలన రద్దు చేయబడుతున్నాయని, అందువల్ల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా రిజర్వే షన్ల పరిరక్షణ కోసం పోరాడాలని 139 బీసీ కులాల ఐక్యవేదిక చైర్మన్ మిరియం శ్రీనివా సులు, ఐఎఫ్‌టీయు రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఆర్. మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మిరియం శ్రీనివాసులు, ఆర్ మోహన్, ఉలవపాడు కరేడు గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత రిజర్వేషన్లు అమలు జరిగే ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ అవుతున్నాయని అందువలన రిజర్వేషన్లు అమలు కావడం లేదని, ప్రైవేటు సంస్థలు కూడా రిజర్వేషన్లు అమలు చేయమని బహిరంగ ప్రకటన చేస్తున్నాయని అందువలన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర పేద కులాల ప్రజలు ప్రభుత్వ రంగ సంస్థలు కాపాడుకోవడం కోసం రిజర్వేషన్ల పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

## వేసవిలో ప్రజలు జాగ్రత్తలు పాటించండి : సిఐ గంగాధర్



**ఆత్మకూరు, ఏప్రిల్14,ప్రభాతవార్త**: ఆత్మకూరు పోలీస్ సర్కిల్ పరిధిలో చిన్నారుల తల్లిదండ్రులు, యువత వేసవి సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.గంగాధర్ సూచించారు. ప్రస్తుతం పాఠశాలలు, కాలేజీలకు సెలవులు ఇచ్చి చిన్నారులు,యువకులు గ్రామాల్లో ఉండి వేసవి దాటికి తమ గ్రామంలోని చెరువులు, బావుల వద్దకు వెళ్ళి ఈతకొట్టే సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకునే ప్రమాదం ఉండడంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండడం వలన జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ వేసవి కారణంగా ఈత రాకపోయినా నీళ్ళల్లో మునగాలి అనే సరదాతో చిన్నారులు ఇంటి నుంఁడి బయటకు వెళుతుంటారని చిన్నారుల కదలికలను గమనిస్తూ చెరువుల వద్దకు నదీ ప్రవాహక ప్రాంతాల వద్దకు , గ్రామాల్లోని బావుల వద్దకు చిన్నారులు వెళ్ళకుండా చూడాలన్నారు. అనుకోని ప్రమాదాలు జరిగితన తర్వాత బాధపడకుండా ముందస్తుగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## అంబేద్కర్ కు మండల పరిషత్ ఘన నివాళులు



**కోవూరు ఏప్రిల్ 14 ప్రభాతవార్త** మహనీయుడు రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు కోవూరు మండల పరిషత్ అధి కారులు ప్రజా ప్రతినిధులు ఘన నివాళులు అర్పిం చారు. ఆమహనీయుని చిత్రప టా నికి మండల పరిషత్ అధ్య క్షురాలు టి.పార్వతి పూలమాల వేసి నివాళులుఅర్పించారు. కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి ఈవోపీఆర్డి శ్రీనివాసులు మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహులురెడ్డి సీనియర్ అసిస్టెంట్ సురేష్ కార్యాలయ అధికారులు ఉద్యోగులు ఉన్నారు.

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలు సాధిస్తాం



**బుచ్చి ఏప్రిల్ 14 ప్రభాతవార్త** నగర పంచాయితీలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ ఆద్వ ర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి మండలాధ్యక్షులు ఎం.వి శేషయ్య,వైస్ చైర్మన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి,పఠాన్ నస్రీన్, కమీషనర్ బాలకృష్ణా, కౌన్సిలర్లతో కలిసి జొన్నవాడ రోడ్డు సెంటర్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కే దక్కిందని ఆమె కొనియాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని కొనియాడారు. మెప్మా సిఐ నర్మదా, మెప్మా ఆర్పీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా ఖజానా కార్యాలయం ఆవరణంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** : జిల్లా ఖజానా కార్యాలయం ఆవరణంలో ఉద్యోగుల పక్షాన సోమవారం అంబేద్కర్ పుట్టి నరోజును అంబేద్కర్ జయంతి జరుపు కోవ డం జరిగింది. డా.బీ. ఆర్ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్‌లో జన్మించారు. దళిత వర్గానికి చెందిన ఆయన తన జీవితంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారు.దళితుడైన కారణం గా అంబేద్కర్ను అంట రానివాడిగా చూసేవారు. స్కూల్‌కు వెళ్లినా వేర్వేరుగా కూర్చోవల్సి న పరిస్థితి. ఒక్కోసారి క్లాస్ రూమ్‌లో కూర్చోనిచ్చేవారు కాదు. ఇన్ని కష్టాల మధ్య అంచెలంచెలుగా ఎదిగిన అంబేద్కర్.. ఒక గొప్ప ఎకనామిస్టూ, జ్యూరిస్టూ, సామాజిక కార్యకర్తగా, రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. భారత రాజ్యాంగాన్ని రచించిన కమిటీకి నాయకత్వం వహించిన ఘనత అంబేద్కర్ సొంతం. ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా.. జిల్లా ఖజానా కార్యాలయం ఆవరణంలో ఉద్యోగుల పక్షాన ఈరోజు అంబేద్కర్ గారి పుట్టిన రోజును జరుపుకోవడం జరిగింది . ఇందులో పాల్గొనినా వారు ఎస్ టి ఓ అలిమ్, సీనియర్ అకౌంటెంట్ రాజేష్ బాబు, సీనియర్ అకౌంటెంట్ యెహోషువ, సీనియర్ అకౌంటెంట్ శేషగిరి, సీనియర్ అకౌంటెంట్ నరేంద్రబాబు, సీనియర్ అకౌంటెంట్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్



**నెల్లూరుసిటీ, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** : నెల్లూరు జిల్లా మెప్మా డిపిఎంయు ఆఫీస్ నందు అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ వారి ఆధ్వర్యంలో మెప్మా సిబ్బంది పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ అంబేద్కర్‌ని స్మరించుకొని అంబేద్కర్ చేసిన సేవలను సంస్కరణలు అంబేద్కర్ న్యాయవాదిగా రాజ్యా ంగాన్ని పొందుపరచిన విధానం, బడుగు బలహీన వర్గాలకు అయన కల్పించిన రిజర్వేషన్, విద్య, రాజ్యా ంగం ద్వారా కల్పించిన ఓటు హక్కును మొదలైన వాటి గురుంచి వివరించారు. ఏఓ సుధాకర్, ఐబి అంకయ్య, మార్కెటింగ్ కాంతయ్య, బిఎల్ హర్షిత, ఎస్ ఏ చంద్ర శేఖర్, రాజ, శామ్యూల్, డి ఆర్ పి జయశ్రీ పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డా. బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు



**నెల్లూరు సిటీ, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** : మహా మేధావి డా:బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతిని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా అధ్యక్షులు పలమాల శ్రీహరి రావు మాట్లాడుతూ ఆర్థిక శాస్త్రవేత్త, గొప్ప రాజనీతిజ్ఞుడు, సామాజిక న్యాయ రథసారథి, సంఘసంస్కర్త, భారతరత్న డా:బి.ఆర్ అంబేద్కర్ అంతర్జాతీయంగా గొప్ప పేరు ప్రఖ్యాతులు గడించారని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొనియాడారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా పలువురు బీసీ నేతలు అంబేద్కర్ వి ఆర్ సి సెంటంలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బిసి ఉద్యోగ అధ్యక్షులు సుంకు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షునిగా, పలు ప్రపంచ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, అతి పెద్దదైనలిఖిత రాజ్యాంగాన్ని అంటరానితనానికి వ్యతిరేకంగా, కుల నిర్మూలన కోసం వారు ఎంతగానో కృషి చేశారన్నారు. న్యాయ సామాజిక ఆర్థిక శాస్త్రాలలో వారు అనేక పరిశోధనలు చేసి,పలు గ్రంథాలను రచించారన్నారు. బిసి న్యాయవాది అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ న్యాయవాదిగా అధ్యాపకునిగాఆర్థిక శాస్త్రవేత్తగా పలు రంగాలలో పనిచేశారన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం అనేక సామాజిక ఉద్యమాలు నిర్వహించారన్నారు. బిసి ఉపాధ్యక్షురాలు విజయమ్మ మాట్లాడుతూ దళితులు గిరిజనులువెనుకబడిన తరగతుల ప్రజల కోసం పలు రాయితీలు రిజర్వేషన్లు రాజ్యాంగ రక్షణలు కల్పించారన్నారు. చిన్ననాటి నుండి అంటరానితనం, అవమానాలను ఎదిరించి, భారత రాజ్యాంగ నిర్మాతగా, భారతదేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న గ్రహీతగా, ప్రపంచ మేధావిగా, అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా అంతర్జాతీయ ఖ్యాతి గడించారన్నారు. ఈ జయంతి వేడుకలలో పలువురు బీసీ నాయకులు పాల్గొని, అంబేద్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.

## పారిశ్రామిక హబ్‌గా అయ్యవారిపల్లె ..ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**వలేటివారిపాలెం ఏప్రిల్ 14, ప్రభాతవార్త** : అయ్యవారిపల్లె ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే అన్నారు. మంత్రి వర్యు లు నారా లోకేష్ వలేటివారిపాలెం పాదయాత్ర సందర్భంగా ఇచ్చి న హామీ మేరకు చర్యలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఇందులోబాగంగా అయ్యవా రి పల్లెలో ఖాళీగా ఉన్న వందలాది ఎకరాలలో ఇం డస్ట్రీస్ ఏర్పాటుకు ఇప్పటికే సంబంధిత అధికారు లుతో సంప్రదించినట్లు ఆయన తెలిపారు. తన సొంతమండలంపై మక్కువతో ఇక్కడే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సోమవారం వలేటివారిపాలెంలో స్వచ్ఛాంద్ర పథకం కింద మంజూరైన ట్రాక్టర్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో నరేంద్రదేవ్ అధ్యక్షత వహించారు. తొలుత రాజ్యాంగనిర్మాత డా॥ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన వలేటివారిపాలెం,పోకూరు, శాఖవరం గ్రామ పంచాయతీలకు ఉచితంగా మంజూరైన ట్రాక్టర్లను రిబ్బను కత్తిరించి ఆయా గ్రామ ప్రతినిధులకు అందచేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో పారిశధ్య చర్యలును ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందన్నారు. పంచాయతీలు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యర్థపదార్థాలను తొలగించి గ్రామాలను పరిశుభ్రంగాఉంచాలన్నారు. ఇందుకు అదికారులు, రాజకీయ నాయకులు సహకరించాలన్నారు. దశలవారీగా అన్ని గ్రామపంచాయతీలకు ఈ సౌకర ్యం అందుతుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో బీటీ రోడ్లు మంజూరుకు ఉదయగిరి ఎమ్మెల్యేతో కలిసి మంత్రులు, కలెక్టర్‌తో వివరించానన్నారు. తద్వారా నియోజకవర్గానికి రూ. 11కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందుకు కలెక్టర్‌కి కృతజ్ఞతలన్నారు. తహసిల్దార్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ అయ్యవా రిపల్లెలో పారిశ్రామిక హబ్‌కు ఎమ్మెల్యే చొరవతీసుకోవడం ఈ ప్రాంతానికి శుభపరిణామమన్నారు. అదేవి ధంగా మండలంలోని పోలినేని పాలెం, కూనిపాలెం తదితర ప్రాంతాలలో4జి ,డంపింగ్‌యార్డులకు సైతం స్థలం గుర్తించినట్లు తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ సుమారు 25లక్షల విలువచేసే ట్రాక్టర్లు ద్వారా పంచాయతీలలో పారిశధ్యచర్యలు చేపట్టాలన్నారు. కూనిపాలెం సర్పంచ్ నవులూరి రాజా మాట్లాడుతూ ట్రాక్టర్ల ఎంపికలో చిన్న గ్రామాలకు సైతం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మండలపార్టీ అధ్యక్షుడు మాదాల చిన్నా మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఆధ్వర ్యంలో పారదర్శకంగా ఎంపిక చేసినట్లు తెలిపారు .దశల వారీగా అన్ని గ్రామాలకు తగిన ప్రాధాన్యత లబిస్తుందన్నారు. ఈవోఆర్డీ రమేష్ బాబు ,సర్పంచ్ శ్రీలత,తెదేపానేతలు వలేటి మధు,కొంకా రమేష్,కాకుమాని హర్ష,వలేటి నరసింహం, ఎంపీటీసీ నరసింహం,కాకుమాని ఆంజనే యులు,వీరమాసు అంజయ్య, అడ్వకేట్స్ శ్రీధర్‌నాయుడు,పెగడా శ్రీనివాసులు,పరిటాల బాస్కర్, పోకూరు నుంచి తిరుమలరావు, గట్టమనేని లక్ష్మి నరసింహం, శాఖవరం పాండు, చుండి నుంచి సాంబయ్య, పోలినే నిచెరువు ఎస్. మాల్యాద్రి, అమ్మపాలెం సుదాకర్, అయ్యవా రిపల్లె, అంక భూపాలపురం బక్కముంతల మాల్యాద్రి లక్ష్మినారాయణ, రాళ్లపాడు వెంకటేశ్వర్లురెడ్డిలతోపాటు వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు ప్రసన్న ఘన నివాళులు



**కోవూరు ఏప్రిల్ 14 ప్రభాతవార్త** మహనీయుడు రాజ్యాంగ నిర్మాత డా క్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జ యంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి సోమవారం తన ని వాసంలో మాజీమంత్రి వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసన్న కుమార్‌రెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించారు .ఈ కార్యక్రమంలో కోవూరు ని యోజకవర్గం సంబంధించిన వైసీపీ సీనియర్ నాయకులు ప్రజాప్రతినిధులు ఉన్నారు

## అంబేద్కర్ కు బిజెపి ఘన నివాళులు



**కోవూరు ఏప్రిల్ 14 ప్రభాతవార్త** కోవూరు లోని ప్రధాన రహదారిలో ఉన్న దివంగత నేత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి సోమవారం ఆ మహనీయుని జయంతి సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు పొలిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. బిజెపి నేతలు పొన్న గంటి వంశీకృష్ణ కనుశెట్టి మురళి బి శ్రీనివాసులు ఎం పూర్ణ రవి ఉన్నారు

## కుల నిర్మూలన కొరకు కృషిచేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్



**కావలిరూరల్, ఏప్రిల్14 ప్రభాతవార్త** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అంటరానితనం, కులనిర్మూలన కొరకు ఎంతో కృషిచేయడం జరిగిందని ప్రజావైద్యులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడు తెలియచేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా కావలి పట్టణంలోని డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు హాస్పిటల్‌నందు సోమవారం వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్‌బాష ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విద్యలో ఎంతో ప్రతిభావంతులని, అనేక సామాజిక ఉద్యమాలకు నేతృత్వం వహించారని తెలియచేశారు. సామాజిక వివక్షతతో ఎన్నో కష్టాలను ఎదుర్కోవడం జరిగిందని తెలియచేశారు. దళిత హక్కులకోసం చేపట్టిన ఉద్యమాలు ఎంతో ప్రఖ్యాతిగాంచాయని తెలియచేశారు. భారతదేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిన ఆ మహనీయులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని తెలియచేశారు. వీరి మరణానంతరం 1990లో అత్యున్నత పురస్కారమైన భారతరత్నను భారతప్రభుత్వం ప్రకటించడం జరిగిందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వాయిస్‌ఆఫ్ ముస్లిం మైనారిటి అధ్యక్షులు మొగల్ సలీంబేగ్, రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు ఎంవి ప్రసాద్‌రావు, మాజీ కౌన్సిలర్ షేక్.మస్తాన్, ఆంధ్ర బాంధవ సేవాట్రస్ట్ దామా మధుసూధన్‌రావు, మీకోసం సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాయపాటి దిలీప్‌కుమార్, హ్యాపీసేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అజిత్‌బాబు, జయభారత్ ట్రస్ట్ కిరణ్‌కుమార్, ఘంటసాల రామచంద్రయ్య, పిఆర్‌ఓలు మాధవ, అక్కిలిగుంట ఆనంద్, నాగరాజు, బాబ్జి, అజయ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్14 ప్రభాతవార్త** రాజ్యాంగనిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కావలి ఎమ్మెల్యే తెలిపారు. సోమవారం కావలి ముసునూరులోని టిడిపి కార్యాలయం,ముసునూరులోని అంబేద్కర్‌విగ్రహంవద్ద, ఉదయగిరి బ్రిడ్జి సెం టర్‌లోని అంబేద్కర్ విగ్రహంవద్ద, బుడమగుంట ఇందిరమ్మ కాలనీలోని అంబేద్కర్ విగ్రహంవద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలువేసి నివాళులర్పించారు. కేకును కట్‌చేసి సంబరాలు చేశారు. ముసునూరు అంబేద్కర్ పార్క్‌లోని విగ్రహంవద్ద ఎమ్మెల్యే మొక్కను నాటారు. పార్క్ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. బ్రిడ్జి సెంటర్ విగ్రహంవద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బుడమగుంట అంబేద్కర్ విగ్రహంవద్ద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. భారతీయ సమాజానికి డాక్టర్ అంబేద్కర్ సూచించిన మార్గం ఎప్పటికీ ఆదర్శప్రాయంగా నిలిచిపోతుందన్నారు. భారతదేశం గొప్పప్రజాస్వామ్యం, గణతంత్ర, లౌకిక రాజ్యంగా వికసించడంలో అంబేద్కర్ కృషి అమోఘమన్నారు. దేశానికి ఆయన అందించిన సేవలు నిరుపమానమన్నారు. అసమానతలు లేని సమాజంకోసం ఆయన అనునిత్యం పరితపించారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజాసంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని కావలిలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అంబేద్కర్ ఆశయసాధనకోసం ప్రతి ఒక్కరం కృషిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అభిమానులు భారీగా తరలివచ్చి పాల్గొన్నారు.

## దొంగతనాలు జరగకుండా ప్రజలు సహకరించాలి



**కోవూరు ఏప్రిల్14 ప్రభాతవార్త** కోవూరు మండల ప్రజలు ఈ వేసవి సీజన్లో దొంగతనాలు జరగకుండా అరికట్టేందుకు పోలీస్ శాఖకు తమ వంతుగా సహకారం అందించాలని సిఐ వి సుధాకర్ రెడ్డి తెలిపారు సర్కిల్ కార్యాల ప్రాంగణంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వేసవి సీజన్లో దూర ప్రాం తాలకు వివాహ కార్యక్రమాలకు వెళ్లేవారు తప్పనిసరిగా తమ మొబైల్ లో ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు దీనివలన ఆ ఇంటి భద్రతపై పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుందన్నారు రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్ గాని 112 నెంబర్ గాని సమాచారం ఇవ్వాలన్నారు అదేవిధంగా ఇంటికి తాళాలు వేసి ఎక్కువ రోజులు బయటకు వెళ్లేవారు ఇంటిలో విలువైన వస్తువులను నగదు డబ్బులను ఉంచరాదు అన్నారు ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవడం వలన వారికి ఎన్నో ఉపయోగాలు కూడా ఉన్నాయన్నారు ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా సిఐ సూచించారు తాళాలు బయటకు కనబడేలా ఉంచడం మంచిది కాదన్నారు అదేవిధంగా షాపులవార్లు తమ షాపు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసు శాఖకు సహకరించాలన్నారు అదేవిధంగా రాత్రివేళల్లో యువత తాగి ద్విచక్ర వాహనాలను వేసుకొని తిరగడం మంచిది కాదన్నారు దీనివలన ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం కూడా ఉంటుందన్నారు ట్రైనీ డీఎస్పీ ఏ శివ ప్రియ హెడ్ కానిస్టేబుల్ రషీద్ తదితరులు ఉన్నారు

## అంబేద్కర్ కు తహసీల్దార్ ఘన నివాళులు



**కోవూరు ఏప్రిల్ 14 ప్రభాతవార్త** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నిర్మలానంద బాబా పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆమహనీయుడు చేసిన సేవలను కొనియా డారు ఈ కార్యక్రమంలో మండల సర్వే రమేష్ గౌడ్ ఏఎస్ఓ చంద్రశేఖర్ సీనియర్ అసిస్టెంట్ సుధా మండ లంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన గ్రామ రెవెన్యూ అధికారులు తహసిల్దార్ కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది ఉన్నారు

## ఆదర్శప్రాయుడు అంబేద్కర్



**నెల్లూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త-వైద్యం** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, నెల్లూరు ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర సెల్ మోర్చాల ఉపాధ్యక్షుడు పుట్టేటి సురేందర్‌రెడ్డిలు కొనియాడారు. భారత రా జ్యాంగ నిర్మాత, మహాత్ముడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం వీఆర్‌సీ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు స్థాయి నుండి దేశ రాజకీయాల్లో గొప్ప స్థాయికి ఎదిగిన డాక్టర్ అంబేద్కర్ అందరికి ఆదర్శం. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. అంబేద్కర్ భారతదేశానికి దిక్సూచిగా కొనియాడారని, ఆయన రాజ్యాంగ నిర్మాతగా దేశ భవిష్యత్తును ముందుగానే ఊహించి భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. అంబే ద్కర్ సేవలు అన్ని వర్గాల ప్రజలకు ఎనలేనివి. ఆయన జీవితమంతా సమాజ అభ్యుదయమే ధ్యేయంగా గడిపారు. ప్రజల్లో సమతా భావాన్ని నింపి, రాజ్యాంగ రూపంలో బడుగు, వర్గాలకు రక్షణ కల్పించారని వివరించారు. ఆ మహనీయుడునికి నివాళులర్పించడం నేను అదృష్టంగా భావిస్తున్నానని వంశీధర్‌రెడ్డి అన్నా రు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెల్ మోర్చాల ఇన్‌ఛార్జీ పి.సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంజనే యరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్సీ పెంచలయ్య, నరసింహనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దం విజయకుమార్, జిల్లా కార్యదర్శి పరుశురాం, చిలుకా ప్రవీణ్ కుమార్, కుప్పా ప్రసన్న , మర్చా అధ్యక్షులు కరణం సుభాషిణి, అశోక్ నాయుడు, లెక్కల రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షులు పద్మ, మింగా కిరణ్, హర్ష, వెంకటేశ్వర్లు, మారం కృష్ణ, సుబ్బారావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయసాధనలో అందరూ పయనించాలి



**కావలి, ఏప్రిల్14 ప్రభాతవార్త** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయసా ధనలో అందరూ పయనించాలని వైసిపి నేతలు తెలిపారు. కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి నివాసప్రాంగణం లోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కావలి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాలమేరకు అంబద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి నేతలు గంధం ప్రసన్నాంజనేయులు, జంపాని రాఘవులు, కనమర్లపూడి వెంకటనారాయణ, అయ్యవారు కృష్ణారెడ్డి, కుందుర్తి కామయ్య, నాగేశ్వరమ్మ, పరుసు మాల్యాద్రి, నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, మాజీ ఎఎంసి ఛైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, పేరం వెంకటేశ్వర్లు, చెన్ను ప్రసాద్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## దుప్పిని చంపిన కేసులో నిందితుడు అరెస్టు



**సైదాపురం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి ఓ దుప్పిని వేటాడి చంపిన కేసులో చాగణం గ్రామానికి చెందిన నరాల సాయిరామ్ తండ్రి కృష్ణయ్య అనే యువకుడిని ఫారెస్టు అధికారులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా నెల్లూరు రేంజర్ ఎస్.మాల్యాద్రి మాట్లా డుతూ మండల పరిధిలోని చాగణం గ్రామానికిచ ఎందిన సాయి ఉన్న అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి అటవీ జంతువు అయిన దుప్పిని వెంటాడి చంపి దాని మాంసాన్ని అతని ఇంట్లో ఉంచగా తమకు వచ్చిన సమా చారం మేరకు జిల్లా అటవీశాఖ అధికారి కే.మహబూబ్ భాషా ఆదేశాలతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకుని, పూర్తి స్థాయిలో విచారించి అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాఅటవీశాఖ అధికారికే.మహబూబ్‌భాషా మాట్లాడుతూ ఎవరైనా అటవీ ప్రాంతా ల్లోకి ప్రవేశించి అటవీ జంతువులను వేటాడితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరిం చారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్లు, లోకేష్, బీట్ ఆఫీసర్‌లు విజయ్, శ్రావణ్, గిరిజాకుమారి ఉన్నారు.

## రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించిన ఘనత సిద్దార్ధదే

### డాక్టర్ జి.బావనా, డాక్టర్ సంతన్ హర్ష



**బుచ్చి ఏప్రిల్ 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని సిద్దార్ధా బా లికల జూనియర్ కళాశాల విద్యా ర్దులు ఈ సంవత్సరం ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 2 వ స్థానం సాధించడం అభినందనీయమని న్యూరాలజి స్టు డా క్టర్ జి.బావనా ,డాక్టర్ సంతన్ హర్ష ప్రశంసించారు.ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికలను వారు ప్రోత్సహ బహుమతులు ఇచ్చి ప్రశం సించారు. డాక్టర్ బావనా మాట్లాడుతు పిల్లలకు ఒత్తిడి లేని విద్యను అందించాలని ఆమె సూచించారు. సిద్దార్ధా కాలేజిలో బాలికలు సాధించిన ఫలితాలు చూస్తే వారు ఎంతో సంతోషంగా పరి క్షలు వ్రాసినట్లు తెలుస్తుందని అన్నారు.తల్లిదండ్రులు కార్పోరేట్ కళాశాలను చూడకుండా మనకు అనూకలమైన సిద్దార్ధా కాలే జి లాంటి వాటిల్లో బిడ్డల్ని చేర్పించాలని అన్నారు. కార్పోరేట్‌కు మంచి సిద్దార్ధాలు ఇంతమంచి ఫలితాలు రావడం హర్షనీయమని కళాశాల ప్రిన్సిఫల్ విద్యాసాగర్‌ని,రామకృష్ణాను ఆమె అభినందించారు. రైన్‌బో పాఠశాల ప్రిన్సిఫల్ పల్లిపట్టు ఏలియాజర్, అద్యాపక బృందం విద్యార్ధులు,తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి నిందలు



కావలి, ఏప్రిల్14 ప్రభాతవార్త అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిందలు వేస్తున్నారని తెలుగుదేశంపార్టీ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. కావలి ముసునూరు లోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరక్టర్ తటవర్తి వాసు, టిడిపి సీనియర్ నాయకులు కండ్లగుంట మధుబాబునాయుడు, తిరివీధి ప్రసాద్, దావులూరి దేవకుమార్, శానం హరి, సన్నిబోయిన కమల్,కంచర్లరఘు, మూగసురేష్, కేతిరెడ్డి విష్ణుతేజరెడ్డి, తదితరులు పాల్గొనిమాట్లాడారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చేస్తున్న అభివృద్దిని చూసి ఓర్చుకోలేక మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిందలు వేస్తున్నారని విమర్శించారు. అయిదేళ్ల వైసిపి పాలనలో గ్రావెల్, రేషన్, యిసుక మాఫియాలతోపాటు జర్నలిస్ట్‌లపై దాడులు, టిడిపి నాయకులు, కార్యకర్తలపై రౌడీషీట్లు ఓపెన్ చేయించిన ఘనత ప్రతాప్‌రెడ్డికే దక్కిందన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతుంటే మాకే సిగ్గుగా ఉందని, నీకు సిగ్గులేదా అంటూ ఆయనపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వంలో జర్నలిస్ట్‌లను వేరుగాచేసి అన్యాయాలు, అక్రమాలకు పాల్పడింది ప్రతాప్‌రెడ్డేనని అన్నారు. వార్తలు రాశారని ఆనాడు జర్నలిస్ట్‌క్లబ్‌ని లేకుండా చేయాలని అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టింది గుర్తులేదా అంటూ ప్రతాప్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇన్ని రోజులకు జర్నలిస్ట్‌క్లబ్ గుర్తుకువచ్చి మా పై మీడియా సమావేశంపెట్టి బురదజల్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని రుద్రకోట గ్రావెల్ కొండ, దగదర్తి ఎయిర్‌పోర్టు భూముల్లో, బిట్రగుంట, అల్లూరు గ్రామాల్లో అక్రమంగా గ్రావెల్‌ఎత్తి కోట్లరూపాయలకు అమ్ముకున్న ప్రతాప్‌రెడ్డి ఈ రోజు మాట్లాడుతుంటే కావలి ప్రజలు నవ్వుకుంటు న్నారన్నారు. ఆరు కేసులు ఉన్న ఓ రౌడీషీటర్‌ను అడ్డంపెట్టుకుని అభివృద్ధి చేస్తున్న తమ ఎమ్మెల్యే దగుమాటిపై పిచ్చిరాతలు రాయించడం సిగ్గుగా లేదా అని వారు ప్రశ్నించారు. అలాంటి రౌడీషీటర్‌కు వత్తాసు పలుకుతూ మీడియా సమావేశం నిర్వహించినపుడే నీ నీచమైన సంస్కృతి కావలి ప్రజలకు అర్ధమైందని టిడిపి నేతలు దుయ్యబట్టారు. గ్రావెల్ తోలుతున్నారని తమ పార్టీపై నిందలు వేశావని, ఆ గ్రావెల్ ఎక్కడికి తోలుతున్నారో ముందు తెలుసుకుని మాట్లాడడం నేర్చుకోమన్నారు. ఆగ్రావెల్ తుమ్మలపెంట రోడ్డుకు, మద్దూరు పాడు నుంచి కావలికి వచ్చే రోడ్డు నిర్మాణానికి అన్ని అనుమతులు తీసుకుని గ్రావెల్‌ను తోలుతున్నారన్నారు. కావలిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డిపై మరోసారి బురద చల్లాలని చూస్తే ప్రజలే నిన్ను బెంగుళూరుకు తరిమికొడతారని హెచ్చరికలు చేశారు. మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య మాట్లాడుతూ వైసిపి ఆర్యవైశ్యనేత కనమర్లపూడి వెంకటనారాయణపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గ్రంధియానాదిశెట్టి గురువూ గురువూ అంటూ వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కనమర్లపూడి నారాయణ అని ఆమె విమర్శించారు. "నారాయణా నీ ఆలోచన మార్చుకో... నీవు ఎక్కడి నుంచి వచ్చావో గుర్తుపెట్టుకో..." అంటూ మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## శ్రీచెన్నకేశవస్వామి వారి రథోత్సవంలో ఎమ్మెల్యే



**వింజమూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** జై చెన్నకేశవ అంటూ ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ శ్రీ చెన్నకేశవ స్వామి రథాన్నిలాగారు. పట్టణంలోని యర్రబల్లిపాలెంలో వెల సియున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అంగ రంగ వైభవంగాజరుగుతున్నాయి. అందులో భాగంగా ఏడో రోజు సోమవారం రథోత్సవం కార్యక్రమం కన్నులు పండు గగా జరిపించారు. పాత బస్టాండ్ సెంట ర్లో రథోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రథాన్ని లాగారు. ముందుగా ఆలయ ధర్మకర్త గణపం సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాలువా పూలమాలతో ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. రథోత్సవం సందర్భంగా శ్రీహరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం కమిటీ, సింగంరెడ్డి రవి సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, కోదూరు నాగిరెడ్డి, మాజీ సొసైటీ ఛైర్మన్ జూపల్లి రాజారావు, కరకల మాలకొండారెడ్డి, చేబ్రోలు వసంత రావు, రమేష్ ఉన్నారు.

## ఘనంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ర్యాలీ



**బుచ్చి ఏప్రిల్ 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలో దళిత నాయకులు భీమతాటి వెంకటరమణయ్య, బట్టా విల్సన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ర్యాలీని నిర్వహించారు. బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు వద్ద నుండి చెన్నూరురోడ్డు మీదుగా బస్టాండ్ సెంటర్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది.పెద్దఎత్తున బాణా సంచిన కాల్చారు. వెంకటరమణయ్య మాట్లాడుతు ప్రపంచ మేధవి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. రాఘవ,చిన్నా, అల్లాబక్ష, చింతం మల్లికార్జున, బట్టా ప్రవల్లిక, కౌన్సిలర్లు, మోర్ల జయంతి,షేక్ షకిలాబేగం, అనంతమ్మ, ప్రమీలమ్మ, నాయకులు మోర్ల భరత్ తదితరులు పెద్దఎత్తున పాల్గోన్నారు.

## వక్ఫ్ బిల్లు సవరణను వెంటనే రద్దు చేయాలి



**నెల్లూరు,ఎప్రిల్ 14 ప్రభాతవార్త విద్య** ముస్లింల మనోభావాలు, వారి హక్కులని కాలేరాసే విధంగా ఉన్న వక్ఫ్ బిల్లు సవరనలను వెంటనే రద్దు చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్,రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ, మదీనా వాచ్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ హాజీ ఇంతి యాజ్ డిమాండ్ చేసారు. ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నగరంలో నిర్వహించిన భారీ ర్యాలీ లో ఆయన నిరసనతెలిపారు. మటాడుతూ వక్ఫ్ సవరణ చట్టం ముస్లిం సమాజానికి ప్రమా దకరం ఈ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. ముస్లిం సంగ నాయకులు పాల్గొన్నారు.

## బీస్ సర్వసభ్య సమావేశం



**నెల్లూరు, ఏప్రిల్ 14 ప్రభాతవార్త** విద్య సోమవారం నగరంలోని స్థానిక ఇస్కాన్ సిటీ ఏంఎస్‌ఆర్ గెస్ట్ ఇన్‌హాల్ లో బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి (బీస్ ) 10వ వార్షికోత్సవం సందర్భంగా సర్వసభ్య సమావేశాని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిధులుగా విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ , డాక్టర్ పోకల రవి పాల్గొన్నారు. ఎస్.ఈ. విజయన్ మాట్లాడుతూ మొదటగా 10 వ వార్షికోత్సవం జరుపుకుంటున్న బలిజ ఉద్యోగుల అభ్యదయ సేవాసమితి అధ్యక్షులు పి.ఎస్. అనిల్ కుమార్‌కి సభ్యులందరికి ప్రత్యేక శుభాకాంక్షలు.తెలిపారు. 10 సంవత్స రాలనుండి నడపడం చాల కష్టతరం అని,వారు ఈ సేవా సమితిని ఇంకా ముందుకు తీసుకెళ్లాలని కోరుకున్ననారు. ముఖ్య అతిధులని బీస్ సభ్యులు శాలువాలు కప్పి పుష్ప గుచ్చాలు అందించి సత్క రించారు. అధ్యక్షులు శ్రీ పి.ఎస్.అనిల్ కుమార్, కోశాధికారి మల్లికార్జున, వైస్ ప్రెసిడెంట్ అంచనాల నాగేశ్వరావు,ముని శేఖర్ , జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు

## పవన్‌కళ్యాణ్,ఆయన కుటుంబసభ్యులపై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకోం



నెల్లూరు,ఏప్రిల్14 ప్రభాతవార్త-క్రైం రాష్ట్ర డిప్యూటీ సిఎం,జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వాఖ్యలు చేస్తే తాము చూస్తూ ఊరుకోబోమని జనసేన పార్టీ జిల్లా ప్రదాన కార్యదర్శి గునుకుల కిషోర్ హెచ్చరించారు. డిప్యూటీ సిఎం , ఆయన కుటుంబంపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వాఖ్యలుచేస్తున్న వారిపై తక్షణ ం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూజనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నెల్లూరు నగర, రూరల్ డిఎస్పీ కార్యాలయల్లో ఫిర్యాధులు చేయటంతో పాటూ పేటిఎం బ్యాచ్‌బొమ్మలతో స్టేషన్ బయట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గునుకుల మాట్లాడుతు తమ పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి,రాష్ట్ర టిడ్కో ఛైర్మన్, జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ వేములపాటి అజయ్ కుమార్‌సూచలన మేరకు జిల్లా వ్యాప్తంగా జనసన నాయకులు, కార్యకర్తలు అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలని అన్నీ పోలీసు స్టేషన్స్‌లో కేసులు నమోదు చెయ్యాలని కోరారు. ఇందులో భాగంగానేడు తాము కూడా డిఎస్పీ కార్యాల యంలో ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా మహిళలు, చిన్నారులపై అనుచిత వ్యాఖ్యలు చేయటం విచారకమన్నారు. తమ అధినేత రాజకీయ ఎదుగుదల చూడలేక కొన్ని అదృశ్య శక్తులు ఇటువంటి సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తున్నాయన్నారు. వెంటనే అటువంటి పోస్టులను సామాజికమాధ్యమాల నుండి తొలగించాలని, ఆయా పోస్టులను పెట్టిన వారిని గుర్తించి చట్ట పరంగా కఠినంగా విక్షించాలన్నారు. పోస్లుటు పెట్టే ఎవ్వరైనా సరే పోలీసులకు దొరికి తీరుతారని, అప్పుడు తమ జనసేన నేతల ఆగ్రహానికి వారు గుర్తి కాకతప్పదని హెచ్చరించారు. ఇకమీదటైనా ఇటువంటి నీతిమాలని పనులు చేయకుండా ఉండాలన్నారు జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఏటూరి రవికుమార్, సురేష్‌యాదవ్, సుధామాదవ్, జనసేన పార్టీ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జ్ జమీర్, నాయకులు రుషి యాదవ్, గుర్రం కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవం







**వింజమూరు, ఏప్రిల్ 14, ప్రభాతవార్త** వింజమూరులోని యర్రబల్లి పాలెంలో వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అదే విధంగా రథోత్సవం నేత్రపర్వంగా జరిపించారు. స్వామివారిని అమ్మవార్లకు ఉదయాన్నే ఉభయ కర్తలు సమర్పించిన పూజా సామాగ్రి, పట్టు వస్త్రాలను అందుకుని ప్రత్యేక అభిషేకాలు పూజా కార్యక్రమాలను జరిపించారు. స్వామివారిని అమ్మవార్లను గజ వాహనంపై ఉత్సవంగా ఊరేగిస్తూ కళ్యాణ వేదికకు చేర్చారు. మార్గమధ్యంలో భక్తులు ఏర్పాటు చేసిన చలవ పందిళ్లలో సేదతీరుతూ భక్తుల నైవేద్యాలను స్వీకరిస్తూ స్వామివారి ముందుకు సాగారు. బాణసంచా పేలుళ్లతో మంగళ వాయిద్యాలతో భక్తుల గోవింద, చెన్నకేశవ నామాలతో స్వామివారు కళ్యాణ వేదికకు చేరుకున్నారు. కళ్యాణ వేదికలో వధూవరులు ఎదరెదురుగా అధిష్టింపచేశారు. వేద పండితులు సాంప్రదాయబద్ధంగా శాస్త్రయుక్తంగా వేద మంత్రాలతో కళ్యాణ తంతును నిర్వహించారు. హిందూ ధర్మ వివాహ ఘటన కనులకు కట్టినట్లు చూపుతూ జిలకర బెల్లం వధూవరులకు ఒకరిపై ఒకరు తలపై ఉంచి మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతూ ఆ తంతు నిర్వహించారు. తదుపరి ముత్యాల తలంబ్రాలను పోయించారు. మాలమార్పిడి ఘట్టాన్ని నృత్యం చేస్తూ స్వామివారి మాలను అమ్మవారికి అమ్మవారి మాలలను స్వామివారికి ధరింపచేశారు. ఈ ఘట్టం భక్తులకు ఆనంద పర వశం కలిగించింది. అనంతరం భక్తులకు తలంబ్రాలు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తదుపరి స్వామివారు అమ్మవారు పురవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తూ ఆలయానికి చేరుకున్నాడు.

**నేత్రపర్వంగా రథోత్సవం:** కళ్యాణోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారి రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. కళ్యాణోత్సవ తదుపరి గ్రామోత్సవం జరిపించుకుని స్వామివారు రథంపై ఊరేగింపు కై సిద్దమయ్యారు. నాళం సురేష్ ధర్మపత్ని సుజనా కుమారులు సుశాంత్ ప్రణీత్ రమణ ఉభయకర్తలుగా స్వామివారి పూజా సామాగ్రిని ఆలయానికి చేర్చారు. వారు చేర్చిన సామాగ్రితో స్వామివార్లను ప్రత్యేకంగా పూజలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించి పీఠంపై ఉంచారు. రథాన్ని రంగరంగులతో కనువిందు కలిగేటట్లుగా అలంకరించారు. ఆ రథంపై స్వామివారి పీఠాన్ని ఉంచారు. రథానికి ప్రత్యేక పూజలు జరిపి ఎలాంటి ఆటంకాలు కలగకుండా నిర్విఘ్నంగా రథోత్సవం జరగాలని కోరుకుంటూ గుమ్మడి కాయలు దిష్టి తీసి కొట్టారు. వెంటనే వేద పండితులు రథంపై ఆసీనుడై రథం ముందుకు కదిలేందుకు స్వామివారి జెండాను ఊపారు. రథాన్ని లాగేందుకు యువత పోటీలు పడి ముందుకు వచ్చారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు డీఎస్పీ వెంకటరమణ కలిగిరి, ఉదయగిరి సీఐలు ఇతర పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. గోవింద నామాలు జై చెన్నకేశవ జైజై చెన్నకేశవ అంటూ మంగళవాయిద్యాల నడుమ రథాన్ని ముందుకు లాగారు. దారిపొడవునా భక్తులు అశేష సంఖ్యలో స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అసలే ఎండ వేడిమి ఎక్కువ కావడంతో భక్తుల దాహార్తిని తీర్చేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ రస్నా పెరుగన్నం, మంచినీరు. పులిహోర తదితర వాటిని భక్తులకు అందుబాటులో ఉంచారు. భక్తులకు ఎండ తాకిడి నుండి తప్పించుకునేందుకు ట్రాక్టర్లతో నీటిని రహదారి వెంబడి పోయించారు. ప్రతి కూడలి నందు భక్తులు స్వామివారికి కాయ కర్పూరం గుమ్మడి కాయలు పగులగొట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారు తన చల్లని చూపులతో భక్తులకు దర్శనభాగ్యం కలిగిస్తూ కదిలి వెళ్లారు. ఈ కార్యక్రమాలను స్వామివారి భక్త బృందం ఆలయ ఈవో బి.శాంతయ్య, ధర్మకర్త గణపం సుదర్శన్‌రెడ్డిలు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కావలి డీఎస్పీ పి.శ్రీధర్, కలిగిరి సీఐలు ఎంవీ నారాయణ, వింజమూరు ఎస్సైలు వీర ప్రతాప్, కలిగిరి ఎస్సై ఉమా శంకర్, ఉదయగిరి ఎస్సై ఇంద్రసేనారెడ్డి, కొండాపురం ఎస్సై వెంకటరావు, ఇతర పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వింజమూరు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని కనులారా తిలకించి కాయ కర్పూరం చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు.